

# గుహలు

'కృష్ణ'

చేతిలోనుంచి పేపరు యెప్పుడు జారి పోయిందో_ ఎంత సేపట్నుంచి ఎదురుగా వున్నదేమో చూడకుండానే నాకన్నులలా తెరుచుకుని వుండిపోయినాయో_ స్తబ్దుణ్నై కూర్చున్న నాలోని హృదయం నుండి ఉబికి సుకుమారమయిన భావ పరంపరల "జల" ఎలా నులివెచ్చని భాష్ప బిందు రూపాన అనువదించబడ్డదో తెలీదు.

చేత్తో నన్ను తాకి "ఏ మి ట లా గ' అంటున్న సీతని చూశాను.

ఉలికిపడ్డట్టు అయి కన్నులు తుడుచుకున్నాను.

జారిపడిన పేపరునువొడిలోకి లాక్కుని చిరునవ్వు తెచ్చిపెట్టుకుంటూ "ఎంచేతో యేమో_ చదూతూంటే ఒక్కోసారలా కళ్ళంట నీళ్లొస్తున్నాయి" అన్నాను.

అదో మోస్తరుగా చూస్తూ "పోనీ ఓ సారి ఐ స్పెషలిస్టును చూడరాదూ" అని లోనికి వెళ్ళిపోయింది సీత_ నా భార్య.

అదేధ్యాసతో యాంత్రికంగా పేపరు తీసుకుని పుస్తకాలగూడు దగ్గరికి వెళ్ళేను.

* * *

హోల్డాళ్లూ, సూట్ కేసులు చేతుల్లోను. చంకన ఎయిర్ బ్యాగులూ వాటర్ కేన్‌లతో వో మోస్తీరు పరుగుతో ప్లాట్‌ఫాం మీదికి వచ్చిపడుతూన్న మమ్మల్ని చూసి నవ్వి.

"కొంచెం ముందుగా బయల్దేరి వుంట కూడదూ" అన్నారు ప్రొఫెసరు.

ఇబ్బందిగా ముఖంపెట్టి యేదో సంజాయిషీ చెప్పబోయినాడు రెడ్డి.

"బయల్దేరే వేళయింది. శ్యాంరావు అక్కడున్నాడు. మీ సీట్లన్నీ అక్కడే వెళ్ళండి.

బరువులు లాక్కుంటూ మా రిజర్వ్‌డ్ సీట్ల కోసం పరుగెత్తాను.

కిటికీ ప్రక్కన సీట్ల కోసం ప్రారంభమైన తగాదా కారణంగా చివరికి ఖచ్చితంగా ఎవరిసీట్లో వాళ్ళు కూర్చోవలసిందేనని తీర్మానం జరిగింది. నాకు మాత్రం కిటికీప్రక్కనే సీటు దొరికింది.

రెడ్డి అతిదీనంగా బ్రతిమాలుతున్నాడు ఆవలి ప్రక్క "కిటికీ సీటు"కోసం. నాకు నవ్వొస్తూంది.

మా పదిమంది విద్యార్థిబృందమూ, అయిదుగురు సోదరీమణులు (అలా అనడానికెంతేనా అభ్యంతరం వుంది రెడ్డికి) సర్దుకుని కూర్చున్నారు.

వేనొక్కణ్ని విసిరేసినట్లు యీవలి సెల్ లో పడాను. వాళ్ళవతలికి తొంగిచూసి కొంచెం గేలిచేశారు.

గార్డు విజిల్.

ఫ్లాస్కు చంకనవేసుకుని సూట్ కేస్‌తో త్వరత్వరగా మా పెట్టెలోనికి వచ్చింది

బార్బరా, శ్యాంరావు వెంటరాగా.

"ఎక్కడ నా సీటు!" కోమలి నడిగిందామె.

భుజాలెగరేసి క్రింది పెదవి వెలుపలికి తిప్పింది కోమలి.

"దక్కిపోయినాయి ముత్యాలు"—రెడ్డి.

ఇంతలో శ్యాంరావ్ బార్బరాకు నాకెదురుగావున్న సీటు చూపించేడు.

బిక్కచచ్చిపోయాను. ఇరవై గంటలపాటు యెదురుగా యీ మనిషిని కూర్చోబెట్టుకుని యెలా ప్రయాణించగలను!

రెడ్డి నవ్వుతూనే వున్నాడు.

నుదుటిమీదికి పోతూన్న చేతిని సభ్యత కోసం ఆపుజేశాను.

బార్బరా విదేశంనుంచి వచ్చిన విద్యార్థిని. అనుకుంటే మా అయిదుగురు సోదరీమణులు కొంచెం సర్దుకుని ఈమెని కూడా తమతో కూర్చోబెట్టుకుని వుందురు. కానీ వాళ్ళెవరూ ఈమెతో సరిగ్గా మాట్లాడరు గదా!

తన సీటుపై నిల్చుని బరువైన సూట్‌కేసుని బెర్తుపైకి యెత్తుకుంటూంటే కిటికీలోనుంచి అవతలకి చూస్తున్నట్లు ముఖం తప్పించుకున్నాను.

రైలువేగం పుంజుకుంటోంది.

పెద్దగా నవ్వుతూ, గుండెలోకి లాగి వదిలిన పొగలోనుంచి మాట్లాడుతున్న రెడ్డి వెనకవేపునుంచి వినిపిస్తూనే వున్నాడు.

"దోజ్ త్రీ యేప్స్ వర్ ది ఛీఫ్ ఎట్రాక్షణ ఆఫ్ సేవాగ్రాం యినో (ఆ మూడు కోతుల బొమ్మలు సేవాగ్రాంలో ముఖ్యాకర్షణ)". ఆ అయిదుగురు విద్యార్థినుల్లో జుత్తు కత్తెర వేయించుకున్న ముగ్గురమ్మాయిలకు రెడ్డి "త్రీ యేప్స్" అని పేరు పెట్టాడు.

నా సంగతి చెప్పుకోవాలి. నాకు బార్బరా అంటే అసహ్యం లేదు. లేదు నిజమే. కానీ—ఆమె వొంటినలుపూ, ఆమెనొక్కుల జులపాల జుత్తూ చూసినప్పుడల్లా తిరిగి ఆ ఆవేపు మళ్ళీ మళ్ళేవి కావు నా చూపులు. ఆమె మా క్లాసులో చేరిన మొదటిరోజు తప్ప ఆమె ముఖం వేపు ఒక్కసారికూడా సరిగా చూడలేదు అనొచ్చు. కానీ బార్బరా అంటే నాకు అసహ్యంలేదు.

పేపర్ చదవటంలేదు — అడ్డం పెట్టుకున్నానంతే.

★

గూడూరు జంక్షన్‌లో కాఫీలు—నాకు మెలకువ వచ్చింది. ఉదయం ఎనిమిది గంటలయ్యుంటుంది. మా మిత్రులంతా ఉపాహారాల కోసం పరిగెత్తినట్లున్నారు.

సీట్లోనే వొరిగుండి రెప్పలు వాల్చి తన్ను నేను పరికించుకున్నాను. చేరగిలబడి ఉన్నది నా శరీరం. నా కాళ్ళు రెండూ బార్బరా కాళ్ళమీద తిష్ఠవేశాయి.

షాక్ తిన్నట్టు వెంటనే కాళ్లు లాక్కుని ఆమెవేపు చూశాను. మూలకి ఒదుగువేసు తని దానిపైకి వొరిగి సాలోచనగా కిటికీలోనుంచి అవతలకి చూస్తో వున్నది. నాకు చాలా సిగ్గనిపించింది. బాధవేసింది.

క్షణమాత్రంలో బైటపడ్డాను.



# గుహలు

బాధ తగలేదు_ఆమెని నా కాళ్ళు తాకినందుకూ_వేదాంతినిలా సహిస్తూకూర్చున్న ఆమెని క్షమాపణ యాచించలేకపోయినందుకు.

మదరాసు విశేషాలు చెప్పుకోతగినవి_జ్ఞప్తికి రావడంలేదు. అక్కడ ఆడపిల్లలకి ఓ గర్ల్స్ హాస్టలులో వసతి యేర్పాటు చేశారు. కానీ వూహించగలను. ఆ "త్రీ యేప్స్"_ఇందుకని తెలీని గర్వప్రవృత్తి గల ఆ అమ్మాయిలు ఆమెనెంత ఉదాసీన భావంతో చూసివుంటారో_పాపం బార్బరా ఎంత బాధపడి వుంటుందో.

బార్బరాపై నాకు కలిగిన భావం_జాలో, కరుణో, మైత్రీభావమో అవన్నీ కలసిన ఒక ఆర్ద్రీభావమో _ అలాంటిది యెప్పుడు ఎందుకని జనించిందో _ యేమీ స్పష్టంగా జాడకట్టలేను.


కంజీవరం దేవాలయాల వాస్తుశోభ వివరంగా తిలకించలేకపోయింది బార్బరా. చిదంబరంలోకూడా ఆమెకు లోనికి రావడానికి అనుమతి దొరక్కపోయింది. ఉద్వైతైన వరద రాజస్వామి, కామాక్షి, ఏకామ్రనాథదేవాలయాల గోపురాల శోభా,పంక్తులు పంక్తులుగా సన్నని వివరాలతో చెక్కిన అలంకార పట్టికా శిల్పాలూ, నగిషీచెక్కిన వడ్డాణాలవలె అధిష్ఠానం పైన చుట్టుకొని సన్నని రాళ్ళతో అల్లబడినట్లుండే బేలూరు, హాలెబీడు, సోమనాధపురంలోని హోయసల కాలపు దేవగృహస్వాముల దివ్య సౌందర్యమూ లాలిత్యమూ చూస్తుంటే బార్బరా ముఖంపైన విరసిన అద్భుతమైన వెలుగు_పసితనపులాంటి ఆశ్చర్యం నన్ను చిత్రంగా ముగ్ధుణ్ని చేసినవి.

ఆమె లోనికి రాగలిగిందల్లా జినకంచిలో మాత్రమే. రాగలిగింది గానీ జనాదరణ అంతగా లేని ఆ జైన దేవాలయాలుగానీ, కర్పూరాగరు చందనాది సుగంధద్రవ్య పూజాపరిమళాలు వెల్లివిరియని ఆ ఆలయాంతర్భాగాలుగానీ ఆమెపై వలసినంతగా ప్రభావం కల్గించలేదేమోననిపించింది నాకు.

త్రోవంటా నడుస్తూంటే కూడా బార్బరాతో యెవరూ యెక్కువగా మాట్లాడేవారు కారు. ఒక్కత్తే మౌనంగా దేవాలయ ప్రాకారాలు, అడ్డబట్టలు కట్టుకుని విభూతి పులుముకొని నడుస్తూంటే తమిళ సోదరుల్ని. నడికట్టుతో ఫాలభాగాన కుంకుడుకాయంత కుంకుమ బిందువుతో నడయాడే ఆడపడచుల్నీ ఆసక్తితో పరికిస్తూన్న ఆమె ముఖంలో వ్యక్తమైన భావాలు నాలో తెలీని ఆవేశాన్ని రేపేవి.

అలాంటి ఆవేశ పూరితమయిన చిత్తవృత్తిలో వెంట నడుస్తూ బార్బరాతో చెబుతూండేవాణ్ని_ "ఈ దేవాలయాల లోపల శోభని చూస్తే నువ్వింకా పరవశురాలివౌతావు. ఈ రాష్ట్రంలోని వాళ్ళు మా దేశంలో తెలివితేటలుగల వాళ్ళలో అగ్రశ్రేణివాళ్లు. కానీ ఎంత చదువుకున్నా వీళ్ళు దేవాలయాలలోనికి వచ్చిన తరువాత దేవుడి ముందు గట్టిగా చెంపలువాయించుకుంటారు. విభూతిని రాసుకుంటారు. రాతితో చెక్కిన విగ్రహాలకు భక్తితో నమస్కరిస్తారు. ఆధునికతకూ సంప్రదాయసిద్ధమైన ఆచార వ్యవహారాలకూ సమన్వయం మనం యిక్కడ దర్శించవచ్చు.

"రాళ్ళలో దేవుణ్ని చూడటం ఆదిమవాసుల ప్రవృత్తి అంటారు. నేటి హేతువాదులు_?"




"అయితేమేం అలా భావించం. హేతువు కందని చోటునుంచి విశ్వాసం ఆరంభమౌతుందని మా భావన. ఈ రాళ్ళు హేతువాదం నేర్పలేని ప్రసాదించలేని సంసార విశుద్ధ దృష్టి. ఐహిక విషయాల స్వల్పతా, విశ్వజనీనమైన కరుణ, భూతదయ ప్రేమాదులు మాకు నేర్పుతాయి. దేవాలయాలకు వచ్చినప్పుడయినా కనీసం మేం బిచ్చం వేస్తాము, అల్ప ప్రాణుల్ని ఆదరిస్తాము. ఎక్కడేనా చేపలకు తినుబండారాల్ని పెట్టడం నువ్వు చూశావా?"

ప్రొఫెసరు చెప్పేవారు.

"మా దేవాలయ వాస్తు సంప్రదాయం నిన్న మొన్నటిది కాదు. వేదకాలంనాటి ఏయిన యజ్ఞవేదికలనుంచీ, రధాలనుంచీ, గోపుర ద్వారాలనుంచీ సంతరించుకున్న బాహ్యాకృతీ సృష్టి పరిణామం ; అండపిండ బ్రహ్మాండ పర్యంతమన్న జ్ఞానంనుంచీ మాయావృత పూర్ణ పురుషుని భావన మొదలయిన మౌలిక సిద్ధాంతాలనుంచి విక్షేపించిన అంతరార్థం కలిగినది మా దేవాలయపు వాస్తువు.

ఆమె చూసిన ప్రతి దేవాలయపు వాస్తు విభాగాల యేర్పాటూ వ్రాసుకునేది. బార్బరా ప్లింత్‌నుంచి ఫినియల్‌దాకా వున్న వాస్తు లక్షణాల్ని ఓపిగ్గా గుర్తుపెట్టుకునేది.కొన్ని కొన్నిచోట్ల మేం నమస్కరిస్తూన్న విగ్రహాలకు ఆమెకూడా చేతులు జోడించేది.

ఈ విజ్ఞానయాత్ర పొడుగూతా మా స్నేహితులామెపట్ల కొన్నిసార్లు, అంతరంగికంగా కొన్నిసార్లు బహిరంగంగా చూపిన అపహాస్య దృష్టి చిన్నచూపూ, గ్రహించినప్పుడల్లా పలకపైన రాతిగీత పడ్డట్లనిపించేది నా మనస్సులో.

ఎక్కడేనా మా ప్రొఫెసరు ప్రశ్నించినప్పుడు మా మిత్రోత్తములు చెప్పలేకపోయిన వాస్తులక్షణాల్ని కార్నిస్‌నో, కేపిటల్నో, ఆర్చి బ్రేవ్‌నో స్పష్టంగా నిర్దేశించి చూపగలిగేదామె.

"ఏది తెలియాలన్నా మౌలికమైన జిజ్ఞాసా దృష్టి అవసరం. లేకుంటే చదివిందేనా చూచిందేనా గ్రాహ్యమూ కాదు;జ్ఞాపకమూ వుండదు" నెమ్మదిగా మందలించేవారు ప్రొఫెసరు.

బార్బరాకి ప్రాచ్యకళలపైనా. దేవాలయ వాస్తువుపైనా కల అభిరుచీ టక్కున ముక్తసరిగా చెప్పే ఆమె సమాధానాలు మా ప్రొఫెసరుకు కలిగించే తృప్తి ఆయన ముఖ కవళికల్లో మాకు కన్పిస్తూనేవుండేది.

మా మిత్రు లెవరికీ చిన్నతనం అన్పించేది కాదు.

మదరాసునుంచి బెంగుళూరు ప్రయాణంలో బార్బరాకి మావిద్యార్థినుల ప్రక్కనే సింగిల్‌సీటు. నేను నా మిత్రుల్తో కూర్చు

న్నాను. "మగపిల్లలు సరే_సాటి ఆడ దానితో వీళ్ళు ఎందుకు స్నేహంగా వుండ లేరా!" అన్పించేది వాళ్ళని చూ స్తే.

మైసూరువద్ద బృందావనం చూడటానికి వెళ్తూన్నప్పుడు బార్బరా అడిగింది "ఆ విగ్రహం యేమిటి? రక్షకదేవతా?"

"అది కావేరీ నది _ మేం పర్వతాల్ని, నదుల్ని కృతజ్ఞతా భావంతో దేవతలుగా పూజిస్తాము."

"అంటే పంచభూతాల్ని భావించినట్లే నన్నమాట?"

ఒక క్షేత్రం నుంచి మరొక క్షేత్రం _ వైష్ణవ పుణ్యక్షేత్రాల్నించి కైవల్య ప్రసాదకాలయిన దేవాలయాలకూ _ నిద్రాది లక్షణాల్నించి బోధిచిత్తత కలిగిన బోధి సత్త్వులవరకూ విగ్రహాల్ని కల్పించిన తాంత్రిక బౌద్ధ విహారాలకూ చైత్యాలకూ, ధార్మిక జ్ఞానదాయకాలయిన జైనుల వసతులకూ మా యాత్ర సాగుతూ పోయింది. శిల్పానికీ, వాస్తు శాస్త్రానికీ అందమైన జోడీ కుదిరించిన పల్లవ చోళ పాండ్య హోయసలుల కళావైశారద్యానికి అనాటంకిత వ్యాఖ్యానాల్లాంటి ఆ ఆలయ సమూహాల్ని చూసి జోహారుచేసేది బార్బరా.

* * *

తెలతెల వారుతూంది.

వ్యాఘ్రనది నీటి తరంగాలు పులికోరల్లా కాళ్ళను కరుస్తున్నాయి. ఆధునిక విజ్ఞానమయ ప్రపంచాన్ని ఆవరించివున్న అధిభౌతిక దృష్టిలా అజంతా కొండలలో పరచుకుని వున్నది హిమధూమం.

ఎత్తైన రాయిమీద నిల్చున్నాం.

మఫ్లర్ మెడకి చుట్టుకుంటూన్న బార్బరాని ఉద్దేశించి అనుకుంటూ శ్యాంరావ్. అన్నాడు నాతో యింగ్లీషులో (ఆమెకి తెలియాలని) "నల్ల రాణి అందం నిన్ను బాగా ఆకర్షించినట్లుందే!"

బార్బరా వులికిపడ్డట్లు శ్యాంరావ్‌ని చూసి నన్ను చూసింది.

చాలా తేలికగా కొట్టిపారేయాలని నేను యత్నించిన నవ్వు నా పెదాలపైకి రాలేదు. మనస్సులో సుడులు తిరుగుతూన్న భావం బైటపడ్డది. "ఔను".

బార్బరా విచిత్రంగా చూసింది.

నాకూ, బార్బరాకూ అదేగుహ ఆదేశించబడ్డది. నేను ఆ కుడ్యచిత్రాలమీదా, ఆమె ఆవాస్తువుమీదా మానోగ్రాఫ్ సమర్పించాలి.

స్నేహితులు ఖుశ్శీ ఖుశ్శీ నవ్వుతున్నారు.

బార్బరా అర్థం చేసుకోలేకపోలేదు వాళ్ళని. ఆ తరువాత నన్నడిగింది ఆమె _ "ఉదయం నల్లరాణిని గురించి మాట్లాడుతున్నారు వీళ్ళు _ నన్నుద్దేశించేకదూ?"

ఆమె తెలివిగలది. ఆమెవద్ద దాచే పని లేదు. "ఔతేయేం?" అన్నాను.

ఆమె మాట్లాడలేదు.

"మీరు బాధపడుతున్నారా?"

"అయితే యేం చెయ్యగలం _ అది వాళ్ళ సరదా."

అలాగే నీటికేసి చూస్తూ కూర్చున్నాం. మంచు విచ్చుకుని సతతహరిత వృక్షాల శోభ కనువిందు చేయసాగింది. అలాగ నిమిషాలు దొర్లిపోతున్నాయి.

నేను ప్రక్కకి చూశాను. కొద్దిదూరంలో కూర్చున్న మా మిత్రులంతా బసకి వెళ్ళిపోయినారు, లేదామనుకుంటూండగా ఆమె అన్నది "నల్లరాణి మీకెలాగ కన్పించింది?"

ఆలోచిస్తూ అన్నాను "నాబైటి కన్నులకంటే లోని కన్నులకు యెక్కువగా నచ్చింది. ఆమె కన్నులలో నాకేదో నిర్లిప్త దృష్టి స్ఫురిస్తుంది. క్రమంగా ఆమె నా బహిర్నేత్రాల్నికూడా ఆకర్షిస్తూన్నట్లన్పించింది."

చిత్రంగా నావేపు చూసి అన్నది బార్బరా "ఆ కారు నలుపులో అందం కన్పిస్తోందా?"

"ఇప్పుడిప్పుడే" _ చిరునవ్వుతో అన్నాను.

"థాంక్యూ" పల్చగా నవ్వింది బార్బరా "లేదామా?"

మరునాటి పగలల్లా మిగతా గుహలన్నీ చూశాము. సాయంత్రం కొండబాటన అందరూ వాహ్యాళికి బయలుదేరేరు. అందరికంటే వెనుక బయలుదేరిన నాకు ఆ సమూహంలో విసిరివేసినట్లు బార్బరా అగుపడలేదు.

అప్రయత్నంగా నా కాళ్ళు ఆగిపోయినాయి.

నవ్వుల్లో తీగల్లా చలించుకుపోతూన్న 'మూడుకోతులూ'_వాళ్లూ నాగరికతా పథంపైన నడచే మైలురాళ్ళలా కన్పించేరు.

సాలోచనగా బార్బరా బసవేపు నడచేను.

'లోనికి రావచ్చునా?'

"తప్పక" అన్న బార్బరా ముఖంలో కొంచెం విస్మయం.

కూర్చున్నాను.

"మీరు బైటికి రారూ?"

నవ్వ ప్రయత్నిస్తూ అన్నది బార్బరా "రావాలన్పించడంలేదు."

"ఎందుకని?"

"ఏమీలేదు"

"కాదు — రండి. మాట్లాడుకుంటూ వెళ్దాము"

కాసేపటికామె బయలుదేరింది.

బార్బరా ముఖకవళికల్లో ఎంతో మార్పు తోచింది నాకు. మొట్టమొదట అంత పట్టించుకోని బార్బరా_ బాధని ముఖంపైకి రాకుండా దాచలేకపోయింది.

# సంగీతమే సంగీతం

పైన గాలికి ముక్కలై
తిరిగి కలసే మొగిలు మదిలో,
పూల తరగలతో కలల నురుగులతో
క్రింద కదలే నదులలో
సంగీతమే సంగీతం

నవ్వుతూ ఏడుస్తూ పోయే
ఉదయ సాయం సంధ్యలో,
పాటతో కన్నీటితో
సాగిపోయే మంచులో
సంగీతమే సంగీతం,

నరాలలో ప్రవహించే
క్రొన్నెత్తుటి నా కలలో,
చీకటి గుడిలోపడి
విలవిలలాడే ఎదలో
సంగీతమే సంగీతం

నరక భ్రాంతిని మాపే
వెలుగు రెక్కలువిప్పి సాగే
ఆశాహంసీ యానం
ప్రతిస్వనించు హృదయంలో
సంగీతమే సంగీతం

శయ్యపై నలగి వాడిన
పూలమాలను చూచి ప్రొద్దున
మనసులో ముర్మురించే
ప్రణయ స్మృతుల కెరటాల్లో
సంగీతమే సంగీతం

ముడుచుకొన్న ఎదను చీల్చి
వచ్చే వేదనా గీతం
స్ఫులింగమై ఎగసే వేళ
సూర్యునంటి తేజంతో
సంగీతమే సంగీతం

మాదిరాజు రంగారావు

# గుహలు

మానవ ప్రపంచం ముక్కలు ముక్కలుగా రంగుల్లోకి తెగిపోయింది. ఎరుపూ నలుపూ తెలుపూ. ఎప్పుడూ అంత బాధగా అన్పించదు గానీ ఒక్కోసారి మనస్సు కెలికినట్లు అన్పిస్తుంది" దృఢమైన ఆమె చెక్కిళ్ళపైన కన్నీళ్ళు రాలేయి.

"భ్రాంతిపడకండి. మీలో కొద్దిరోజుల క్రితం కన్పించిన సమచిత్తత స్థైర్యం యేమైంది? మీ జాతి ముందుకు పోతున్నది. మీ త్యాగదృష్టి తాత్త్వికుల నాకర్షిస్తూన్నది. మీ ధైర్యానికి ప్రపంచం హర్షిస్తున్నది. మీ లోని సౌందర్యం కళావేత్తల్ని ఆకర్షిస్తూన్నది."

నా ధోరణికి విస్మయచకిత అయి అలాగే చూస్తూండిపోయింది.

"మతానికీ. కులానికీ ఆదిమమయిన మానవ దృష్టి ప్రపంచాన్ని నిశ్శబ్దంగా జయించడం మొదలుపెట్టింది. ప్రపంచంలోని రంగులన్నీ వాటి వాటి స్థానాలలో సముచితమైనవే. ఏదీ అధికమయిందికాదు. ఏదీ లోకువైంది కాదు"

కొంత నిశ్శబ్దం తరువాత అడిగిందామె— 'మీరు చదువయాక యేం చేస్తారు?'

'ఉద్యోగం—భార్యా పిల్లలు—' నవ్వేను నేను.

'ప్రశాంత జీవనం అన్నమాట'- నవ్విందామె,

'మీరో?' అన్న నా ప్రశ్నతో

బార్బరా విచ్చిన నల్లని కలువల్లాంటి కళ్ళు పరిసరాల్ని దాటి ఎక్కడో చూడసాగినవి. 'నేనా — అమెరికా వెళ్ళాలనుకుంటున్నాను. అక్కడ....' నిశ్వసించి అన్నదామె— 'యేదో చెయ్యాలని వున్నది.'

నాకు అర్థమైంది.

మనిషి పూర్వీకుడు నాలుగుకాళ్ళపై నడచే స్థితి దాటుతూన్నప్పుడు జంతుజాలాన్ని యెదుర్కోవలసివచ్చింది. వేలాది సంవత్సరాల తరువాత యిప్పుడూ పోరాటం సాగుతూనే వున్నది. సంపదకోసం కాక—దేశాల మధ్య కాక— చీకటిలా మనిషి మనస్సుని కప్పివున్న జాతిభావంవల్ల.

మా సంభాషణ వచ్చేటప్పుడు మారింది.

"నేను కొన్న బొమ్మలు చూశారా?" బసకి వచ్చినతరువాత అడిగేను.

చూపించేను, ఆర్కియలాజికల్ సర్వే వారు ముద్రించిన ఆ బొమ్మలు- "ఆసన్నమరణ రాజపుత్రి"— "దుర్గతి పరిశోధన— అవలోకితేశ్వర"-"బోధిసత్త్వపద్మపాణి" 'నల్లరాణి' సన్నని లలితమయిన రేఖల్లో అందంగా యిమడ్చబడ్డ చైతన్యం. సౌకుమార్యం ప్రభావశీలమైన భావవ్యక్తీకరణ.



స్నానం

చిత్రం : శేఖర్

---

ఆమె 'నల్లరాణి' బొమ్మ తిప్పబోతూండగా చెయ్యి అడ్డువుంచి అన్నాను 'నాదొక చిన్న అభ్యర్థన—'

ప్రశ్నార్థకంగా చూసిందామె.

"ఇక్కడ— మీ సంతకం."

నా బలవంతంపైన దృఢమయిన వ్రేళ్ళ మధ్య కలం పట్టి తమలపాకు తీగలవంటి అక్షరావళిలో తన పేరు వ్రాసింది 'పి.ఎఫ్. బార్బరా.'

కృతజ్ఞతలు తెలిపేను. "ఈ నల్లరాణిని చూసినప్పుడల్లా నాకు మీరు గుర్తువస్తూంటారు— పదండి భోజనానికి వెళ్దాము."

బయట ప్రకృతిని బంధించిన కొండల అడవులలోనికి అందంగా వ్యాపిస్తోంది చీకటి.

* * *

నల్లరాణిలో నిక్షిప్తమైన సౌందర్య కౌముది, ఆమె ప్రభావం నీటిలోకి తామర తూడులా పెరిగిపోసాగింది నాలో.

క్రితం రోజు బార్బరా ముఖకవళికలు నాకు గుర్తుకువచ్చేయి. 'నలుపులో యేమయినా సౌందర్యం కన్పిస్తోందా?'

చలిగాలి వీస్తూ వుంది. బ్లాంకెట్ లాక్కున్నాను చెవులమీదికి. శాతకుండం నుంచి దూకుతున్న వ్యాఘ్రనదీ జలపాత ధ్వని, కీచురాళ్ళ చప్పుడూ కలగలసి వినవస్తోన్నది. ఆ చలికాలంలో కొండల యెత్తుల లోని ఆ వసతి గృహం సందులో నేను పడుకోవటం ఆశ్చర్యమే.

క్రమంగా పైకి వస్తోంది చంద్రబింబం. కఠినమైన శైలశిలలపైన మెత్తగా కురుస్తోంది వెన్నెల. కళ్ళు మగతపడసాగుతున్నాయి.

నేను పడుకున్న సందుకు యెదురుగా అజంతా గుహలవరుస అర్థచంద్రాకృతిలో. మానవ సమూహాల్ని విహారాల కాహ్వానిస్తూన్న బౌద్ధభిక్షువు బాహువులలా. చిక్కబడుతూన్న వెన్నెలలో కొంచెం అస్పష్టంగా కన్పిస్తున్నవి.

బడలిక తీర్చుకుంటూన్నది శరీరం. మనసు ఆ గుహలలోనే విహరిస్తున్నది. ఆ వరుసలో గుహలో వినూత్న సౌందర్య కోణం చూపించిన నల్లరాణి చిత్తరువు.

ఆ కన్నులలో. మాట్లాడే శక్తి. మంత్రించే శక్తీ ఉన్న నల్లరాణి— వందల కొలది సంవత్సరాలుగా గుహలో చీకటిలో తన కాంతి బయటకు రాకుండా తన సౌందర్యం జగత్తు నేత్రాలకు అతీతంగా వుండిపోయిన నల్లరాణి.

గుహలోనుంచి, చీకటిలోనుంచిగాలిలో, వెలుగులో నడచి వచ్చింది. చేతులు జాపిన నల్లరాణి చేతులలో నేను కుమ్మరి చేతిలోని మట్టిముద్ద.

* * *

ఉదయం లేచి 'వ్యాఘ్ర'కేసి బయలుదేరుతూంటే బయటకు వస్తూ కన్పించింది బార్బరా.

'గుడ్ మార్నింగ్' అన్నాను.

'వెరీ గుడ్ మార్నింగ్' చిరునవ్వుతో బార్బరా.

ఆ రోజునే మా తిరుగు ప్రయాణం. ఇరవై రెండు రోజులుగా సాగిన మా యాత్రలో నా కంటికీ, మనస్సుకూ ప్రపంచాన్ని చూడటానికి ఒక కొత్త కోణం.

తిరుగు ప్రయాణంలో మా మిత్రులు 'నల్లరాణి' ప్రసక్తి తెచ్చినప్పుడు నేను చూడగా,

ఆమె ముఖంలో ఒక క్రొంగొత్త వెలుగు, స్థైర్యం, అచంచలమైన ఆత్మవిశ్వాసం స్ఫురించే నవ్వు.

* * *

బార్బరా ఆ యెండల్లో వెళ్ళిపోయింది. ఆమె ప్రభావం నా మనస్సులో ఒక చెరగని ముద్ర.

* * *

పుస్తకాల గూడులో ఫ్రేం కట్టిన నల్లరాణి దివ్యచిత్రం—క్రింద సొగసుగా వాలిన అక్షరాలలో "పి. ఎఫ్. బార్బరా."

నల్లరాణి గచ్చు చిత్రంపైన— యెవరో రాళ్ళతో గీకిన వార్త— "ఫ్రేం" కట్టిన ఆ వార్త పేపర్లో—

నా కంటికి ఏదో పొర అడ్డమైంది.

నా మనస్సులో నేను చూసివుండని న్యూయార్కు పురవీధులూ— యేవో నినాదాలూ—తుపాకి చప్పుళ్లూ — ★